## క్లుప్తంగా

### పరిమితికి మించి నగదు తీసుకెళ్లొద్దు



**అమరచింత:** స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనల్లో భాగంగా పరిమితికి మించి నగదును తీసుకెళ్లొద్దని ఎస్ఐ స్వాతి అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్ గ్రామంలో నారాయణపేట జిల్లా సరిహద్దులో పోలీస్ చెక్‌పోస్టును బుధవారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు వాహనాల తనిఖీ చేపట్టారు. రూ.50 వేల కంటే అధికంగా ఉంటే వాటికి సంబంధించి వివరాలను తెలియజేయాలని సూచించారు. ఆధారాలు లేని పక్షంలో నగదును సీజ్ చేస్తామని పేర్కొన్నారు. వాహనదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి



**పాన్‌గల్:** చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి సామర్థ్యాల పెంపే లక్ష్యంగా బోధన చేయాలని విద్యాశాఖ జిల్లా కమ్యూనిటీ మొబిలైజర్ ఆఫీసర్ (సీఎంఓ) ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను సబ్జెక్టుల వారీగా పరిశీలించారు. పాఠశాలల్లోని భవిత సెంటర్ ప్రత్యేక అవసరాల గల విద్యార్థుల సామర్థ్యాలు, భవిత సెంటర్ భవన నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, వెంకటేష్, ఐఈఆర్పీ సంతోష్, స్పీచ్ థెరపిస్ట్ హరిశంకర్ పాల్గొన్నారు.

### దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

**వీపనగండ్ల:** వరి పంటలో దోమపోటు, సుడిదోమ లక్షణాలను ప్రారంభదశలోనే గుర్తించడం వల్ల వాటి నివారణ సులువు అవుతుందని ఏవో డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. వరిలో దోమపోటు ఆశించిందని గుర్తించేందుకు పిల్ల, పెద్ద దోమలు గుంపులుగా ఉండి మొక్కల మొదళ్ల నుంచి రసాన్ని పీలుస్తాయని, దీంతో ఆకులు లేత పసుపు రంగులోకి మారుతాయని తెలిపారు. వరి మడుల్లో పంట సుడులుసుడులుగా వలయాకారంలో ఎండిపోతాయని పేర్కొన్నారు. నిర్లక్ష్యం వహిస్తే తాలు గింజలు ఏర్పడి రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. వీటి నివారణ కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించి అవసరమైన మేరకు మందులను వాడాలని సూచించారు. మందులు పిచికారి చేసే సమయంలో పొలంలో నీటిని తగ్గించుకొని మొక్కల మొదళ్లలో మందులు పడేవిధంగా రైతులు జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు.

### ప్రజాహక్కుల కోసం పోరాటం ఆగదు

**వనపర్తి విద్యావిభాగం:** ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సతీష్‌యాదవ్ ఆరోపించారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. పురపాలికలో టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి పరాకాష్టకు చేరుకుందన్నారు. కాసులు ఇస్తే ఏదైనా అధికారులు చట్టాన్ని పక్కనపెట్టి డబ్బు కోసం ప్రజల ఆరోగ్యాన్ని, భద్రతను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. పాత బస్టాండ్ ఎదురుగా గతంలో అనుమతి లేకుండానే వ్యాపారి సెల్లార్ టవర్ కోసం తవ్వకాలు చేపట్టారన్నారు. దీంతో అధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిపివేశారన్నారు. పెద్దగుంతలో పిచ్చిమొక్కలు పెరిగి, వర్షాల వల్ల నీరు నిల్వవడంతో చుట్టుపక్కల వ్యాపారులు, ప్రజలు రోగాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే ప్రదేశంలో మరో వ్యాపారి పరదా కట్టి ఆ గుంతను కప్పేశారని అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇలాంటి అవినీతి నిర్లక్ష్యంపై ప్రజలకు నిజాలు తెలిపేందుకు అఖిలపక్ష ఐక్యవేదిక మున్సిపాలిటీపై 'అవినీతి వారోత్సవాలు' నిర్వహించి వాళ్ల బాగోతాన్ని బహిర్గతం చేస్తామని తెలిపారు.

### సామగ్రి పంపిణీ



**వనపర్తి రూరల్:** మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ సీడీపీఓ రమాదేవి బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి సీడీపీఓ హజీరాబేగంతో కలిసి టీవీ, ప్రీ స్కూల్ సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

# వానొస్తే.. చెరువే

- ఇళ్లకు వెళ్లేందుకు తప్పని తిప్పలు
- 15 ఏళ్లైనా మౌలికవసతులు కరువు
- సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి



అయోధ్యనగర్ కాలనీలో నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

**గోపాల్‌పేట:** చిన్నపాటి వర్షం కురిస్తే ఇళ్లకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోందని మండల కేంద్రంలోని అయోధ్య నగర్‌కాలనీ వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే పై నుంచి వచ్చేనీరు మొత్తం కాలనీలో చేరి ఇళ్లకు వెళ్లకుండా ఇంట్లో నుంచి బయటకు రాకుండా ఉండాల్సి వస్తోందని చెబుతున్నారు. కాలనీ ఏర్పడి 15 ఏళ్లయినా రోడ్లు, కరెంటు స్తంభాలు సరిగా లేక తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నామని పాలకులు మాటఇచ్చినా ఇప్పటివరకు రోడ్లు సరిగా వేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మండలంలోని ఏదుట్ల గ్రామంలో ఇళ్లలో నీరు వస్తోందని వెంటనే సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

**ఇదీ పరిస్థితి..**

అయోధ్యనగర్ కాలనీలో ప్రజలు సుమారు 15ఏళ్ల నుంచి ఉంటున్నారు. కాలనీలో సుమారు 300 ఇళ్ల వరకు ప్రజలు నివాసం ఉంటున్నారు. వర్షం పడిన ప్రతిసారి కాలనీలోకి పై నుంచి వచ్చే నీరు చేరి చెరువును తలపిస్తోంది. రాంనగర్‌కాలనీ, హనుమాండ్ల గడ్డ కాలనీల నుంచి పోలీస్‌స్టేషన్ పక్క నుంచి నీరు వెళ్లేది కానీ కాల్వ సరిగా లేకపోవడంతో అయోధ్యనగర్ కాలనీలోకి నీరు చేరుతోంది. కాల్వ మరమ్మతులకు మూడేళ్ల క్రితం ప్రతిపాదనలు వచ్చినా పనులు ముందుకు సాగలేదు. దీంతో కాలనీలోని ప్రజలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. వెంటనే కాల్వ నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేయడంతో పాటు కాల్వను ఏర్పాటు చేస్తే అయోధ్య నగర్‌కాలనీలో నీరు నిలవదని ప్రజలు చెబుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే రెండురోజుల క్రితం ఏదుట్లలో కురిసిన వర్షానికి గ్రామంలోకి కొన్ని ఇళ్ల ముందుకు నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

**అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు**

అయోధ్యనగర్ కాలనీలోకి నీరు చేరి ఎక్కువరోజులు నిల్వ ఉండటంతో దోమలు ప్రబలుతున్నాయి. దీంతో వృద్ధులు, చిన్నపిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని కాలనీ పజ్రలు ఆరోపిస్తున్నారు. దోమలతో రాత్రివేళల్లో నిద్రపట్టడం లేదని సంబంధితా అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

**నీరు నిల్వలేకుండా చూడాలి**



అయోధ్యనగర్ కాలనీలో గత పదిహేనుళ్ల గా ఉంటున్నాం. వర్షాకాలం వచ్చిందంటే మాకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షం పడితే కాలనీలోకి నీ రు ఎక్కువగా రావడం వల్ల ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. పనులు చేసుకునేందకు వెళ్లాల్సి ఉన్నా పిల్లలను బడులకు పంపించాలన్నా ఇబ్బందులకు గురవు తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలి.

–సురేష్, అయోధ్యనగర్, గోపాల్‌పేట

**పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టా..**

అయోధ్యనగర్ కాలనీ కొంత లోతట్టు ప్రాంతంలో ఉంది. ఇందువల్ల నీరు నిలుస్తోంది. కాల్వ నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం పీఆర్ ఏఈతో ప్రతిపాదనలు వేయించాం. సుమారు రూ.25లక్షలు అయితే కాల్వ పూర్తవుతోంది. ఆ తర్వాత నీరు నిల్వ లేకుండా ఉంటుంది. ప్రజాప్రతినిధులు వచ్చాక మళ్లీ ప్రతిపాదనలు వేసి కాల్వ నిర్మాణం చేపడతాం. ప్రస్తుతం దోమలు ప్రబలకుండా 15 రోజులకోసారి ఆయిల్‌బాల్స్ వేస్తున్నాం.

–బాల్‌రాజు, సెక్రెటరీ, గోపాల్‌పేట

# సీజేపై దాడి హేయమైన చర్య



వనపర్తిలో దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న నాయకుల



నిరసన పాల్గొన్న మాలమహానాడు నాయకులు

**వనపర్తి టౌన్:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగింది వ్యక్తిగత దాడి కాదని, రాజ్యాంగ, భారత న్యాయవ్యవస్థపై జరిగిన ప్రత్యక్ష దాడి అని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సీజేఐపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇలాంటి ఘటనలు దేశ చరిత్రలో మచ్చలాగ నిలుస్తారని విస్మయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరాజు, నాగరాజు, సహదేవుడు, చిన్నదాసు, రమేష్, వెంకటేష్, దాసరి బాబు, ఎ.రమేష్, శివకుమార్, పెద్దిదాసు పాల్గొన్నారు.

**వనపర్తి రూరల్:** సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో సీజే గవాయిపై దాడికి యత్నించిన న్యాయవాది రాజేష్‌కిషోర్ దిష్టిబొమ్మ దహనం చేస్తూ నిరసన తెలిపారు. న్యాయవాదిని అరెస్టు చేసి దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. దాడికి పాల్పడం మతోన్మాద విష సంస్కృతికి నిదర్శనమన్నారు. గత ఏ ప్రభుత్వం ఇలాంటి ఘటనలు జరగలేదన్నారు. కార్యక్రమంలో కళావతమ్మ, శ్రీరామ్, చిన్నకురుమన్న, జయమ్మ, వెంకటమ్మ, అఖిల్, జ్యోతి, సుప్రియ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

### అండర్–19 కబడ్డీ జట్టుకి ఎంపిక



**అమరచింత:** పట్టణానికి చెందిన రాజు ఎస్‌జీఎఫ్ అండర్–19 కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు కోచ్ జిలాని బుధవారం తెలిపారు. ఇటీవల ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో జరిగిన అండర్–19 కబడ్డీ ఎంపికలో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడన్నారు. వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

### పేకాట స్థావరంపై దాడి.. ఐదుగురి అరెస్టు

**వనపర్తి రూరల్:** పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ యుగేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల్ పరిసర ప్రాంతానికి చెందిన ఉప్పరి ఆంజనేయులు, గువ్వలరాముడు, కావలి ఈశన్న, బండమీది గోవిందు, కావలి బాలకృష్ణ, కొంతమందితో కలిసి బుధవారం సాయంత్రం పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామ శివారులోని కృష్ణానది పక్కన పాత వాటర్‌ప్లాంట్ దగ్గర పేకాట ఆడుతున్నారని పక్క సమాచారం రావడంతో పోలీసులు వెళ్లి దాడులు చేశారు. ఆడుతున్న వారిలో 5 మంది అదుపులోకి తీసుకోగా, మిగతావారు పారిపోయారు. వారిదగ్గర నగదు రూ.22,250, ఐదు సెల్‌ఫోన్లు, 10 బైక్‌లు, పేకముక్కలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా



అంగీకార పత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

**ఖిల్లాఘనపురం:** సీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతు బుధవారం మండల సీహెచ్‌సీ ఎదుట ఖిల్లాఘనపురం, ఆత్మకూర్, రేవల్లి, వీపనగండ్ల సీహెచ్‌సీ ల పారిశుధ్య, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నాలుగు నెలలుగా తమకు రావల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఏజెన్సీ వారు తమ జీతాల్లో కోతలు పెడుతున్నారని, తమ డిమాండ్లు నెరవేర్చాలని పట్టుబట్టారు. కార్మికుల ధర్నాకు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మద్దుతు తెలుపుతూ పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి, సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వాహకులు కిషోర్, వైద్యాధికారి డాక్టర్ చైతన్య చర్చలు జరిపారు. చివరకు 10రోజుల్లో పెండింగ్ వేతనాలు చెల్లిస్తామని, జీతాల్లో కోత విధించామని ఏజెన్సీ వారు ఒప్పుకోవడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తి అదృశ్యం



**ఆత్మకూర్:** ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటనలో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేందర్ తెలిపారు. ఆత్మకూర్ పట్టణంలో భార్గవి నగర్‌లో నివాసముంటున్న ముష్టి విష్ణువర్ధన్ హోటల్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం పనిమీద బయటకు వెళ్లి వస్తానని ఇంటినుంచి పోయిన విష్ణు నేటివరకు తిరిగి రాలేదన్నారు. దీంతో బంధువుల వద్ద ఆరాతీసిన ఆచూకి లభించలేదని వివరించారు. భార్య పల్లవి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న విజయరాములు

**ఆత్మకూర్:** పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణశెట్టి అధ్యక్షతన మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోట్లంపల్లికి చెందిన 10 మంది పార్టీలో చేరారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ నాయకులు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఐకి ప్రజల మద్దతు ఎప్పుడు ఉంటుందన్నారు. అన్ని స్థానాల్లో పోటీచేసి గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. కార్యాక్రమంలో జిల్లా నాయకులు శ్రీహరి, సీఎన్‌శెట్టి, రాబర్ట్, మోష, రాములు, బాలకృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### సెల్‌ఫోన్ అందజేత



**ఆత్మకూర్:** చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేసి బుధవారం బాధితుడికి అందజేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. కత్తేపల్లి గ్రామానికి చెందిన రమణ సెల్‌ఫోన్ సెప్టెంబర్ 29న చోరీకి గురైందన్నారు. కర్నూలులో ఫోన్ ట్రేస్ చేసి స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించినట్లు పేర్కొన్నారు. ఫోన్లు చోరీకి గురయిన, లేదా పోగొట్టుకున్న వారు సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**పాన్‌గల్:** మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాల 1978–79 సంవత్సరం పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించారు. 46 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. బాలీశ్వర్‌రెడ్డి రూ.2లక్షలతో పాఠశాలలో సమస్యలను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, వరలక్ష్మి, విజయమ్మ, అలివేలమ్మ, చంద్రకళ, కృష్ణారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, లక్ష్మణచారి, వరదారెడ్డి, వెంకటస్వామి, రవీందర్‌రెడ్డి, మాసూం, గోవింద్, మాధవరెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

### బాధితులకు పరామర్శ


**పాన్‌గల్:** మండలంలోని గోప్లాపూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన గంధం బాలయ్య కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సురభిపుల్లారావు పరామర్శించారు. దహన సంస్కరణలకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజగౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

**వనపర్తి రూరల్:** వనపర్తి మండల జెడ్పీటీసీ స్థానానికి పోటీచేసే అభ్యర్థులు మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను అందజేయాలని ఎంపీడీఓ రవీంద్రబాబు బుధవారం తెలిపారు. చిట్యాల, చిమనగుంటపల్లి, అంకూరు, ఖాసీంనగర్ ఎంపీటీసీ అభ్యర్థులు చిట్యాల పంచాయతీ కార్యాలయంలో, పెద్దగూడెం, కడుకుంట్ల, రాజపేట, మెంటేపల్లి, ఎంపీటీసీ అభ్యర్థుల పత్రాలను పెద్దగూడెం పంచాయతీలో అందజేయాలన్నారు. చందాపూర్, పెద్దగూడెంతండా, సవాయిగూడెం ఎంపీటీసీ అభ్యర్థుల పత్రాలను చందాపూర్ పంచాయతీలో అందజేయాలన్నారు.

పెబ్బేరు మండల జెడ్పీటీసీకి పోటీచేసే అభ్యర్థులు మండల పరిషత్ కార్యాలంలో నామినేషన్ పత్రాలు అందజేయాలని ఎంపీడీఓ రోజారెడ్డి అన్నారు. గుమ్మడం, యాపర్ల అయ్యవారిపల్లి ఎంపీటీసీల అభ్యర్థులు గుమ్మడం పంచాయతీలో పత్రాలు అందజేయాలన్నారు. సూగూరు, రంగాపూర్, పెంచికలపాడు ఎంపీటీసీకి రంగాపురం పంచాయతీలో పత్రాలు ఇవ్వాలన్నారు. తోమాలపల్లి, కంచిరావుపల్లి, వైశాఖాపూర్ ఎంపీటీసీల అభ్యర్థులు తోమాలపల్లి పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను అందజేయాలన్నారు.

శ్రీరంగాపురం జెడ్పీటీసీకి స్థానానికి పోటీచేసే అభ్యర్థులు జానంపేట, నాగరాల ఎంపీటీసీ స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలను శ్రీరంగాపురంలో కమ్యూనిటీ భవనంలో నామినేషన్ పత్రాలను ఎంపీడీఓ రవినారాయణ అందజేయాలన్నారు. శ్రీరంగాపురం–1, తాటిపాముల, కంభాళాపురం ఎంపీటీసీకి శ్రీరంగాపురం పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను అందజే యాలని తెలిపారు.



**ఖిల్లాఘనపురంలో మండలంలో**

**ఖిల్లాఘనపురం:** ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల ఎన్నికల కోసం అభ్యర్థులు గురువారం నుంచి నామినేషన్లు తీసుకుంటామని ఎంపీడీఓ సునిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీకి నామినేషన్ స్వీకరించడం జరుగుతుందన్నారు. ఎంపీటీసీలకు ఖిల్లాఘనపురం పంచాయతీ కార్యాలయంలో ఖిల్లాఘనపురం–1, ఖిల్లాఘనపురం–2, వెంకటాంపల్లి, కమాలోద్దీన్‌పూర్ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. అదేవిధంగా సోళీపురంలో సోళీపురం, ఉప్పరిపల్లి, షాపురం, మానాజీపేట స్థానాలకు, మామిడిమాడ పంచాయతీ కార్యాలయం దగ్గర మామిడిమాడ, వెనికితండా, అప్పారెడ్డిపల్లి, అల్లమాయపల్లి పత్రాలు తీసుకుంటామని తెలిపారు.

**గోపాల్‌పేట:** ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్స్ స్వీకరించేందుకు ఎంపీడీఓలు బుధవారం ప్రకటన విడుదల చేశారు. నామినేషన్ల నిర్వహణకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. గోపాల్‌పేట ఎంపీపీ చాంబర్, ఎంపీడీఓ చాంబర్ గోపాల్‌పేట, బుద్దారం, ఏదుట్ల పంచాయతీ కార్యాలయంలో నామినేషన్స్ స్వీకరిస్తామని తెలిపారు. ఏదులకు సంబంధించి ఎంపీపీ చాంబర్ ఏదుల, ఎంపీడీఓ చాంబర్ ఏదుల, పంచాయతీ కార్యాలయం సింగాయిపల్లిలో ఏర్పాటు చేశామన్నారు.

# ప్రాథమిక హక్కులు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ నాయమూర్తి వి.రజని

**వనపర్తి రూరల్:** విద్యార్థులు ప్రాథమిక హక్కులను వినియోగించుకొని, ప్రాథమిక విధులను పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ నాయమూర్తి వి.రజని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని చిట్యాల ఎంజేపీ గురుకుల పాఠశాల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆమె పాల్గొని ఆర్టికల్ (14) (19)(21) ప్రాముఖ్యత, గోల్డెన్ ట్రయాంగిల్ ఆర్టికల్స్ అంటారని తెలిపారు. అదేవిధంగా మహిళలకు, చిన్నపిల్లలకు ,షెడ్యూల్ ట్రైబ్స్, షెడ్యూల్ వయోవృద్ధులకు, మతిస్థిమితం లేని వారికి, సామూహిక విపత్తు, మానవ అక్రమ రవాణా బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. బాల్యవివాహాల నిషేధ చట్టం, బాలకార్మికుల నిర్మూలన చట్టం, మోటారు వాహనాల చట్టం ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సలహాల కోసం నల్సా 15100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం కృషితో ఎదగాలి



మహిళా సమాఖ్య సభ్యులతో ఏ డీఆర్డీవో

**కొత్తకోట రూరల్:** మహిళలు స్వయంకృషితో ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఏ డీఆర్డీవో సరోజ పిలుపునిచ్చారు. మండల మహిళా సమాఖ్య పరిధిలో ఏర్పాటు చేసిన మగ్గం వర్క్ శిక్షణ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మగ్గం వర్క్ వంటి వృత్తులు స్వయం ఉపాధికి దారి చూపుతాయన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఏ రంగంలోనైనా ప్రతిభ చాటగలరన్నారు. అంతకు ముందు ప్రాజెక్ట్ ఆఫీసర్ కాశీం మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలపడటానికి ఉపయోగాపడ్తాయన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మాధవిరాణి, ఫీల్డ్ మేనేజర్ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థులకు సన్మానం



కొత్తకోటలో విద్యార్థులను సన్మానిస్తున్న కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు

**కొత్తకోట రూరల్:** పట్టణకేంద్రంలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులను ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సన్మానించారు. బుధవారం మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌జే.బోయేజ్, పి.కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ పీజే బాబుతో పలువురు కాంగ్రెస్ నాయకులు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ అభినందనలు తెలిపారు. విద్యార్థులు కష్టపడి సాధించిన ఈ విజయంతో కొత్తకోట ప్రాంతం గర్వపడుతుందన్నారు. విద్యార్థుల కష్టపడి చదివి భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సలీంఖాన్, సలీం, మిషేక్, నరేందర్‌సాగర్, ఎన్ఎస్‌యూఐ నాయకులు ముస్తఫా, దిలీప్‌రెడ్డి, మోహన్ రెడ్డి, తయ్యబ్, మతిన్, ఐవైసీ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ అజర్‌అలీ, కదిర మహేష్, సాయిలు, పెంటన్నయాదవ్, సుభాష్, బాదం వెంకటేష్, శంకర్‌యాదవ్, ఖలీల్ తదితర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**వీపనగండ్ల:** మండలంలోని సంగినేనిపల్లి గ్రామానికి చెందిన దివ్యాసీన్ నీట్ ఫలితాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంపై గ్రామంలోని పలువురు విద్యార్థిని అభినందించా రు. విద్యుత్‌సంస్థలో పనిచేస్తున్న సాయిప్రకాష్ గ్రా మంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవీల కుమార్తె మహబూబాబాద్‌లోని ప్రభుత్వమెడికల్ కాలేజీలో సీటు పొందారు.

### డివైడర్‌ను ఢీ కొన్న కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**కొత్తకోట రూరల్:** అతివేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో కారులో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాలు ప్రకారం కొత్తకోట సమీపంలో ఓ కుటుంబ కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ కారులో వెళ్తుండగా ముందుటైర్ పగలడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నది. శరత్, సాయి స్వరూప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108కు సమా చారం అందించి అనంతరం జిల్లాసుపత్రికి తరలించారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

### దుకాణంలో 6 లీటర్ల మద్యం లభ్యం

**వనపర్తి రూరల్:** వనపర్తి పట్టణంలోని చందాపూర్ రోడ్డులోని శాంతినగర్ కాలనీలో బుధవారం మంజునాథ కిరాణం షాపులో 6లీటర్ల మద్యం పట్టుకున్నామని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణంలోని చందాపూర్ రోడ్డు శాంతినగర్ కాలనీలో ఎల్లపు రమేష్ మంజునాథ కిరాణం షాపులో తనిఖీ చేయగా 6 లీటర్ల మద్యం లభించింది. మద్యం విలువ రూ.4325 ఉంటుందన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

### టీకాల పంపిణీలో నిర్లక్ష్యం వీడండి

**వీపనగండ్ల:** మారుమూల ప్రాంతాల్లోని చిన్నారులకు టీకాలు వేయించడంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యాన్ని వీడి సకాలంలో టీకాలు వేయించాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. బుధవారం హెల్త్ సబ్‌సెంటర్‌లో పేర్ల నమోదు, టీకాలు వేయించిన పనితీరు, పేర్ల నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.